
సిగనుంచి నెలవంక ఎగసిన వేళ..



శివుడి సిగలోని నెలవంక నిశి వేళ ఆకాశంలోకి ఎగిరినట్లుగా కనిపిస్తున్న ఈ దృశ్యం శుక్రవారం రాత్రి చిత్తూరు లోని నీవానది ఒడ్డు నున్న మృత్యుంజయేశ్వర ఆలయం వద్ద కనిపించింది. ఇక్కడి కైలాస నాథుడి విగ్రహం సిగపైన నెలవంక.. ఆ పైన ధనుష్కా నక్షత్రమూ చూసి నగర ప్రజలు పులకించిపోయారు. నూలు పోగులు సమర్పించి నమస్కరించారు.

- చిత్తూరు,ఆంధ్రజ్యోతి

తిరుపతి, చిత్తూరు, మదనపల్లెల్లో

రేపే ముగ్గుల పోటీలు



ఆంధ్రజ్యోతి ఏటా సంక్రాంతికి ముందు నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలు రేపు జరగనున్నాయి. తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు తిరుపతి, చిత్తూరు, మదనపల్లి కేంద్రాల్లో ఆదివారంనాడు జరుగుతాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో జరుగుతాయి. తిరుపతి నగరంలో నెహ్రూ మున్సిపల్ స్కూల్ మైదానం (స్విమ్స్ సర్కిల్), చిత్తూరులో పీసీఆర్ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్స్(గాంధీ బొమ్మ సమీపం) , మదనపల్లెలో జడ్పీహైస్కూల్ గ్రౌండ్ (ఆర్టీసీ బస్టాండు దగ్గర) లలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గురిలో ఒకరిని జిల్లా విజేతగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. తిరుపతిలో జరిగే పోటీలకు చిల్లీస్ రెస్టారెంట్స్ అధినేత అంజి, చిత్తూరులో జరిగే పోటీలకు జీజేఎం చారిటబుల్ ట్రస్ట్, మదనపల్లెలో జరిగే పోటీలకు శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కాలేజ్, ఆర్కే జ్యువెలర్స్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, తిరుపతి

సీఎం పర్యటనకు

చకచకా ఏర్పాట్లు!



ద్రావిడ వర్సిటీ మైదానంలోని హెలిపాడ్ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులతో విప్ కంచర్ల

- కుప్పంలో ఎమ్మెల్సీ, కలెక్టర్, ఎస్పీ తదితరుల సుడిగాలి పర్యటన
- 6,7 తేదీల్లో కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం

కుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన 6, 7 తేదీల్లో ఖరారైంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగమంతా శుక్రవారం కుప్పంలో వాలిపోయింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ , కడా పీడీ వికాస్ మర్మత్, జేసీ విద్యాధరి తదితరులు ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం హెలిప్యాడ్, ఆడిటోరియం, అగరం కొత్తపల్లె, ఎన్టీఆర్ స్టేడియం తదితర ప్రాంతాలలో పర్యటించి జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కుప్పం మండల సచివాలయంలో అధికారులతో కలెక్టర్,ఎస్పీ , కడా పీడీ, జేసీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు.హెలిప్యాడ్ వద్ద బారికేడ్ల ఏర్పాటుతో పాటు కార్యక్రమాలు ఉండే ప్రాంతాలకు రూట్ మ్యాప్‌లను పక్కాగా సిద్ధం చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కమిషనర్ శ్రీనివాసరావును ఆదేశించారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. జిల్లాతో పాటు అన్ని శాఖల ప్రగతికి సంబంధించిన సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలని సీపీవోను ఆదేశించారు.ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు సంబంధించి పటిష్ఠమైన బందోబస్తు ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు.డీఆర్వో కె.మోహన్ కుమార్, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈలు చంద్రశేఖర రెడ్డి, విజయకుమార్, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డ్వామా, డీఆర్డీయే పీడీలు రవికుమార్, శ్రీదేవి, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్, వ్యవసాయ, హార్టికల్చర్, పశు సంవర్థక, సెరికల్చర్ శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదనరెడ్డి, డాక్టర్ ప్రభాకర్, శోభారాణి, డీఎల్డీవో రవికుమార్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన ఇలా...

ముఖ్యమంత్రి ఈనెల 6వ తేదీన ద్రావిడ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ ద్వారా కుప్పం చేరుకుంటారు. యూనివర్శిటీ ఆడిటోరియంలో విజన్ డాక్యుమెంట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.అనంతరం అగరం కొత్తపల్లెలో మహిళలతో ముఖాముఖి సమావేశమవుతారు.తర్వాత కుప్పం మున్సిపాలిటీ శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో రైతులతో ముఖాముఖి జరుపుతారు.అక్కడినుంచి బయల్దేరి కుప్పం మండలం నడిమూరు గ్రామం చేరుకుని సౌర విద్యుత్తు పథకాన్ని ప్రారంభిస్తారు.అనంతరం ద్రావిడ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో టీడీపీ శ్రేణులతో సమావేశమవుతారు. ఆదేరోజు రాత్రి కుప్పంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో బస చేస్తారు. 7వ తేదీ ఉదయం కుప్పంలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తారు. అనంతరం కంగుంది చేరుకుని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం తండ్రి దివంగత పీఆర్.శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అక్కడినుంచి కుప్పంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానం చేరుకుని, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఇక్కడినుంచి ద్రావిడ విశ్వవిద్యాలయం చేరుకుని జిల్లా అధికారులతో అభివృద్ధిపై సమీక్ష జరుపుతారు. అనంతరం కుప్పం ఆర్ అండ్ బి అతిథి గృహం చేరుకుని రాత్రి బస చేస్తారు. 8వ తేదీ ఉదయం ద్రావిడ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నుంచి అమరావతి బయలుదేరి వెళ్తారు.

కుప్పానికి కొత్త రెక్కలు

- ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు వేగంగా అడుగులు
- అధికారులతో సమీక్షించిన సీఎం చంద్రబాబు

చిత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం కొత్త రెక్కలు తొడుక్కోబోతోంది. ఇక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రంగం సిద్ధమైంది.బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు అనుసంధానంగా ఈ ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తెచ్చి.. కుప్పాన్ని శాటిలైన్ సిటీగా మార్చాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. లాజిస్టిక్ హబ్‌గా కుప్పాన్ని మార్చి కార్గో విమానాల ట్రాఫిక్‌ను పెంచనుంది. శుక్రవారం సీఎం చంద్రబాబు రాష్ట్రంలో నిర్మించనున్న 7 కొత్త ఎయిర్‌పోర్టులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కుప్పం ఎయిర్ పోర్టు గురించి చర్చించారు.
ఇప్పటికే కుప్పం ఎయిర్‌పోర్టు కోసం ఫీజిబులిటీ రిపోర్టు సిద్ధం చేశారు. దీని నిర్మాణం రెండు దశల్లో చేపట్టనున్నారు. మొదటి దశలో 683 ఎకరాలు, రెండో దశలో 567 ఎకరాలు కలిపి మొత్తం 1250 ఎకరాల్ని ఇప్పటికే గుర్తించారు. దీనికి సమీపంలో ఐఏఎఫ్, హెచ్‌ఏఎల్, బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులున్న కారణంగా ఎయిర్‌స్పేస్ అంశాన్ని కూడా పరిగణన లోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించారు. ఈ కారణంగా దీనికి సంబంధిత వర్గాల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంది.

● ఆరేళ్ల ముందే భూమి పూజ

కుప్పం ప్రాంతంలో పూలు, కూరగాయల సాగు అధికంగా ఉండడంతో ఆయా ఉత్పత్తుల్ని రైతులు సకాలంలో ఎగుమతి చేసుకుని లాభపడటానికి కార్గో విమానాశ్రయం (ఎయిర్‌స్ట్రిప్) ఏర్పాటుకు గత టీడీపీ ప్రభుత్వం ఆలోచించింది. అప్పట్లోనే రామకుప్పం మండలంలోని కిల్లాకిపోడు, మణీంద్రం, కడిసినకుప్పం గ్రామాలు.. శాంతిపురం మండలంలోని అమ్మవారిపేట, సొన్నేగానిపల్లె గ్రామాల్లో 495.15 ఎకరాల్ని సేకరించారు. రూ.16.34 కోట్ల పరిహారాన్ని కూడా పంపిణీ చేసేశారు. 2018లో అప్పటి సీఎం చంద్రబాబు భూమి పూజలు కూడా చేశారు.అయితే తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా విస్మరించింది.మళ్లీ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన రూ.13.46 కోట్ల పరిహారం పంపిణీలో కూడా ముందడుగు పడింది. అప్పట్లో కార్గో ఎయిర్‌పోర్టు అనుకుని.. అందుకు అనుగుణంగా భూసేకరణ చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్గోతో పాటు డొమెస్టిక్ ఎయిర్‌పోర్టును కూడా అందుబాటులోకి తేవాలని నిర్ణయించి మరింత భూమిని సేకరిస్తోంది.



శాంతిపురం మండలం అమ్మవారిపేట వద్ద కార్గో విమానాశ్రయానికి కేటాయించిన భూమి


మొదటిఘాట్‌లో సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ విభాగం సిబ్బంది

తిరుమల కనుమ దారుల్లో కొత్త సోలార్ దీపాలు

- మొదలైన పనులు -

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్లలో సోలార్ లైట్ల అమరిక పనులు మొదలయ్యాయి. 20 ఏళ్ల క్రితం ఈరోడ్లలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు పాడైపోయాయి. గత పాలకులు వీటి నిర్వహణను పట్టించుకోలేదు. ఇందువల్ల రాత్రిపూట వాహనదారులూ, రోడ్డు దాటే సమయంలో వన్యప్రాణులూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త సోలార్ లైట్లను ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే మొదటి ఘాట్‌రోడ్డులో 70, రెండవ ఘాట్‌రోడ్డులో పది ప్రాంతాల్లో నూతన సోలార్ ప్యాడ్లు, లైట్లను ఏర్పాటు చేసే పనులు గురువారం మొదలయ్యాయి. ప్రస్తుతం మొదటిఘాట్‌రోడ్డులో పనులు జరుగుతున్నాయి. వీటి ఏర్పాటుకు దాదాపు రూ.15 లక్షల మేరకు ఖర్చు కానుంది. ఇక, తిరుమల ప్రధాన రహదారుల్లోనూ పాత లైట్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. శుక్రవారం జీఎన్సీ ఆర్చ్ నుంచి బాలాజీ బస్టాండ్ వరకు ఉన్న రహదారిపై 50 నూతన లైట్లను ఏర్పాటు చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, సినీనటి రాశి సింగ్ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.


నేరెళ్ల శారద


రాశి సింగ్

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.4.17 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 62,085

తలనీలాలు సమర్పించినవారు:15,680



● తిరుపతి ఉపాధ్యాయనగర్‌కు చెందిన ఆదర్శ్ ఇంజినీరింగ్ చదివాడు. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో కష్టపడి చదివాడు. మంచి మార్కులతో బీటెక్ పూర్తి చేశాడు. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం రాలేదు. కాలేజి నుంచి బయటపడ్డాక ఆఫ్ కేంపస్ ఉద్యోగాల కోసం చేయని ప్రయత్నం లేదు. ఇప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు..

● పద్మావతినగర్‌కు చెందిన గాయత్రి పీజీ పూర్తిచేసింది. మంచి మార్కులే సాధించింది. ఆకాంక్షలకు తగిన ఉద్యోగమే చేయాలనేది ఆమె ఆకాంక్ష. చిన్నపాటి ఉద్యోగాలు వచ్చినా జాయిన్ కాలేదు. బ్యాంకు, ఆర్ఆర్‌బీ ఇలా ఏ నోటిఫికేషన్ కనిపించినా దరఖాస్తు చేస్తోంది. కొన్నింటికి ఎక్కువమంది హాజరవుతారని నిరాశతో పరీక్షే రాయలేదు. మూడేళ్లయినా ఉద్యోగం పొందలేకపోతోంది.



ఉద్యోగ సాధనకు అకడమిక్ నాలెడ్జ్ ఒక్కటే సరిపోదంటున్నారు తిరుపతిలోని కౌటిల్య సంస్థ డైరెక్టర్ శ్రీధర్. ప్లేస్‌మెంట్ శిక్షణా సంస్థ నిర్వహిస్తున్న ఈయన యువత ఉద్యోగ సాధనకు అవసరమైన కొన్ని సూచనలిస్తున్నారు. ప్రత్యేక నైపుణ్యాలను పెంచుకుని, పట్టుదలతో సాధన చేస్తే ఉద్యోగ కల సాకారమవుతుందంటున్నారు. జాబ్ పొందడానికి ఆయన చెబుతున్న మార్గాలివి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి


శ్రీధర్, కౌటిల్య శిక్షణా సంస్థ డైరెక్టర్

పట్టుదల+కృషి = ఉద్యోగం

● అకడమిక్ జ్ఞానమొక్కటే సరికాదు
● అవసరమైన స్కిల్స్‌పై పట్టు సాధించాలి

రెండు రకాల ప్లేస్‌మెంట్లు ఉంటాయి. బీటెక్, మరేదైనా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లకోసం సన్నద్ధమవుతుంటారు. అయినా చాలా మంది విఫలమవుతుంటారు. బీటెక్ లేదా డిగ్రీ రెండో సంవత్సరం నుంచే జాబ్ ప్రిపరేషన్ అవసరం. కంపెనీలు కోరుకుంటున్న నైపుణ్యాలను అలవర్చుకోవాలి. ప్రత్యేకించి ఏదైనా సంస్థలో ఉద్యోగం కావాలనుకుంటే ముందుగా ఆ కంపెనీకి కావాల్సిన అర్హతలు, నైపుణ్యాలను తెలుసుకోవాలి. వాటికి తగ్గట్టుగా సాంకేతిక నైపుణ్యాలు (కోడింగ్)పై దృష్టి పెట్టాలి.

అకడమిక్ చదువులతో పాటు పరిశ్రమల నైపుణ్యాలకు సంబంధించి శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఒక్కోసారి ఉద్యోగం సాధించడంలో విఫలం కావొచ్చు. అంతమాత్రాన నిరాశపడిపోకూడదు. తాము ఎందుకు విఫలమయ్యామో స్వీయ విశ్లేషణ చేసుకోవాలి. కారణాన్ని ఖచ్చితంగా అంచనావేసి ఆయా అంశాలను సరిచేసుకుని మళ్లీ ప్రయత్నిస్తే ఖచ్చితంగా విజయాన్ని సాధించొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ ఎక్కువగా ఉంటుంది.... పోస్టులు తక్కువగా ఉంటాయి. అందుకు చాలామంది మొదట్లోనే నిరాశ పడతారు. పోటీలో నిలిచేందుకు ఆసక్తి చూపించరు. దరఖాస్తుదారులంతా పోటీ ఇవ్వరని గుర్తించరు. దరఖాస్తుదారుల్లో ఎక్కువ మంది డమ్మీ అభ్యర్థులే ఉంటారు. అందువల్ల సంఖ్యను చూసి ఆందోళన చెందక్కరలేదు.. పోటీ పరీక్షకు తగినట్టు సన్నద్ధమయితే చాలు. విశ్లేషణాత్మక అధ్యయనం, అభ్యాసంతో కూడిన సాధన అవసరం. అకడమిక్ కోసం చదివినట్టు చదివితే ఉద్యోగం రాదు. పోటీ పరీక్షకు తగినట్టుగా అవసరమైన అంశాలపై ఫోకస్ పెట్టాలి.

బ్యాంకు పరీక్షలకు ప్రిపేరయితే తక్కువ సమయంలోనే ఉద్యోగం సాధించవచ్చు. బ్యాంకు పరీక్షల సిలబస్‌తో ఏటా సుమారు 20 పోటీ పరీక్షలు జరుగుతాయి. ఒకే శిక్షణతో, ఒకే సన్నద్ధతతో 20 పరీక్షలకు పోటీ పడొచ్చు. అందువల్ల ఏదో ఉద్యోగం రాకపోదు.

పోటీ పరీక్షల ప్రిపరేషన్ మొదలు పెట్టాక ఉద్యోగం సాధించడానికి 1 నుండి మూడేళ్లు పట్టవచ్చు. కొంత మందికి ఇంకా ఎక్కువ సమయం పట్టవచ్చు. దీర్ఘకాల పోటీలో చాలామంది వైదొలుగుతారు. కేవలం సీరియస్ అభ్యర్థులు మాత్రమే నిలబడతారు. దీర్ఘకాలం సమయం, పట్టదలతో కూడిన ప్రిపరేషన్ ఉంటే సర్కారీ కొలువు సాధ్యమే.

ఉద్యోగ సాధన ప్రయాణంలో మొదటగా ఏ చిన్న ఉద్యోగం వచ్చినా వదులుకోకూడదు. ఆ ఉద్యోగం చేస్తూనే దీర్ఘకాల లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రయత్నించాలి. చిన్న ఉద్యోగమైనా ఆర్థికంగా ఆసరాగా ఉంటుందని గ్రహించాలి. అది ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్నిఇస్తుంది. పెద్ద ఉద్యోగం పొందేందుకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.



ముక్కంటిని దర్శించుకున్న విదేశీ భక్తులు

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం 70మంది అమెరికా భక్తులు దర్శించుకున్నారు. పెంచలకోన కరుణామయి ఆశ్రమ వ్యవస్థాపకురాలు భగవతి విజయేశ్వరి దేవితో కలిసి వారు వచ్చారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అమెరికా భక్తుల శివనామస్మరణతో ఆలయం మారోమోగింది.

వైకుంఠ ఏకాదశికి తిరుమలలో
మైసూర్ నిపుణులచే విద్యుత్ అలంకరణలు

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈఏడాది వైకుంఠ ఏకాదశికి విద్యుత్ అలంకరణ విశేషంగా చేయాలని నిర్ణయించారు. మైసూర్ దసరా ఉత్సవాల్లో విద్యుత్ దీపాలంకరణలు చేసే నిపుణులు తిరుమలలో కూడా అలంకరణ చేస్తారు. అలాగే ప్రత్యేకమైన పౌరాణిక పాత్రలతో కూడిన పూల అలంకరణలూ చేయనున్నారు. ఈ వివరాలను శుక్రవారం అన్నమయ్య భవనంలో జరిగిన వైకుంఠ ఏకాదశి సమీక్షా సమావేశంలో అధికారులు వెల్లడించారు. టీటీడీ ఈవో శ్యామలరావు అధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఐటీ విభాగం జీఎం శేషారెడ్డి, అదనపు ఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. శ్రీవారి భక్తులకు సులభతరంగా వైకుంఠద్వార దర్శనం కల్పించేందుకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. భక్తులకు వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ కేటాయించడం ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. వైకుంఠ ఏకాదశి ముఖ్యాంశాలతో అధికారులు సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్‌ను రూపొందించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు.



నారావారిపల్లెలో
మెగా జాబ్ మేళా


ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే


జాబ్‌మేళాకు హాజరైన యువత

● ఉద్యోగాలకు 689 మంది ఎంపిక

చంద్రగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు స్వగ్రామం.. చంద్రగిరి మండలం నారావారిపల్లెలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మేళాకు నియోజకవర్గంలోని 1832 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి శ్రీసిటీ, నాయుడుపేట, రేణిగుంట, గాజులమండ్యం ఎస్ఈజెడ్‌లు, అనంతపురంలోని కియా మోటార్స్. ఇలా 21 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 689 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరందరికీ సాయంత్రం ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళాలో ఉద్యోగం రానివారు నిరుత్సాహ పడకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో కంపెనీల ఏర్పాటుకు స్థలాలు అనువుగా ఉన్నాయని, వీటి ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. చంద్రగిరికి త్వరలో అనేక ప్రాజెక్టులు రానున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటనకు వచ్చిన పుడల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించేవారని గుర్తుచేశారు. నారా లోకేశ్ యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం నేడు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. ఆరు నెలలకు ఒకసారి మేళా న్విహిసన్తామన్నారు. త్వరలో చంద్రగిరికి ఐటీ కంపెనీలు వస్తాయన్నారు. ఉద్యోగం చిన్నదైనా, పెద్దదైనా ఆత్మస్థైర్యంతో పని చేసి, తల్లిదండ్రుల కష్టాలలో పాలుపంచుకోవాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బొబ్బా లక్ష్మి, ఉపసర్పంచి రాకేష్‌చౌదరి, పులివర్తి సుధారెడ్డి, డీపీవో, స్పెషల్ ఆఫీసర్ సుశీలదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి లోకనాథం, తహసీల్దారు శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, వివిధ సంస్థల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు జాన్వీ కపూర్




తిరుమల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటి జాన్వీ కపూర్ శుక్రవారం కాలినడకన తిరుమలకు వచ్చారు. అలిపిరి నుంచి స్నేహితులతో కలిసి సాయంత్రం బయలుదేరిన ఆమె రాత్రి తిరుమల చేరుకున్నారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. నడకమార్గంలో పలువురు సినీ అభిమానులు ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

పుత్తూరు- అత్తిపట్టు
రైల్వే రూట్ మ్యాప్ సిద్ధం

ఏపీ, తమిళనాడులో నాలుగేసి స్టేషన్లు

పుత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు- అత్తిపట్టు మధ్య రైల్వే లైను రూట్ మ్యాప్ ప్రాజెక్టు సిద్ధమైంది. 88.30 కిలోమీటర్లు.. సింగిల్ విద్యుత్ లైను మార్గంలో ఎనిమిది స్టేషన్లను ప్రతిపాదించారు. జిల్లాలో నారాయణవనం, కృష్ణమరాజుకండ్రిగ, పిచ్చాటూరు, నాగలాపురం.. తమిళనాడులో ఊత్తుకోట, పాలవ్వాకం, పెరియపాలెం, గంగయాదికుప్పంలో స్టేషన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పుత్తూరు రైల్వే స్టేషన్ నుంచి నారాయణవనం మూడు కిలోమీటర్ల పరిధిలో ఉండగా.. మిగిలిన స్టేషన్లు పది కిలోమీటర్ల వంతున ఉన్నాయి. పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనను దృష్టిలో ఉంచుకుని కృష్ణమరాజుకండ్రిగను కూడా స్టేషన్‌గా ప్రతిపాదించారు. ఇక, పుత్తూరు నుంచి దాదాపు 500 మీటర్ల దూరంలో అంటే నారాయణవనం రైల్వే గేటు- మరాఠీ రైల్వే గేట్ల మధ్య ఈ కొత్త రైల్వే లైను తిరుగుతుందని పేర్కొన్నారు. ఈ రైల్వే మార్గంలో 15 మేజర్.. 159 మైనర్ వంతెనలు ఉంటాయని ప్రతిపాదించారు. ప్రతిరోజు ప్రయాణికుల కోసం ఆరు బోగీలు వుండే నాలుగు ఈఎంయులు నాలుగు ట్రిప్పులు తిరగనున్నాయి. ఈ విద్యుత్ రైళ్లు ఇటు పుత్తూరు- చెన్నై, అటు సూళ్లూరుపేట-చెన్నై లైన్లలో కలుస్తాయి. దీంతో శ్రీసిటీ వెళ్లే ఉద్యోగులు, చెన్నై, పుత్తూరు వెళ్లే వ్యాపారులకు అనుకూలంగా ఉంటుంది.



ప్రాజెక్టు ఉద్దేశం

ఈ విద్యుత్‌లైన్ వల్ల ప్రధానంగా బళ్లారి నుంచి ఎగుమతయ్యే ఇనుపఖనిజం, దిగుమతయ్యే బొగ్గు రవాణాకు ఉపయోగమౌతుందని ప్రతిపాదించారు. చెన్నై ఓడరేవు మీద పెరిగిన ఒత్తిడిని తగ్గించేందుకు అట్టిపట్టు సమీపంలోని ఎన్నూరు ఓడరేవును ఎంచుకుని ఈ రైలు మార్గంను ప్రతిపాదించారు.


తిరువళ్లూరు- పెరియపాలెం రెండో విద్యుత్ లైన్

పుత్తూరు-అట్టిపట్టు లైను ప్రాజెక్టు ప్రతిపాదనలోనే తిరువళ్లూరు-పెరియపాలెం మధ్య 28.30 కిలోమీటర్ల మరో చిన్న లైనును అధికారులు ప్రతిపాదించారు. పూర్తిగా తమిళనాడులోనే వెళ్లే ఈ మార్గంలో కలింబాకం, మేల్‌కొండయార్, వెంగల్ వంటి మూడు స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ రూట్‌లోనూ ప్రయాణికుల కోసం నాలుగు ట్రిప్పులు విద్యుత్ రైళ్లు తిరుగుతాయి.

శేషాచలంలో బీటెక్ విద్యార్థుల అదృశ్యం

● ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులతో కలసి పోలీసుల గాలింపు
● మిత్రులకు లొకేషన్ షేర్ చేసిన ఓ విద్యార్థి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం శేషాచల అడవుల్లో బీటెక్ విద్యార్థులు అదృశ్యమయ్యారని సమాచారం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు బీటెక్ విద్యార్థులు ఇక్కడి వాగేటికోన ప్రాంతంలో.. గుంజన జలపాతాలను చూడడానికి శుక్రవారం విహారయాత్రగా వచ్చారు. తిరుగు ప్రయాణంలో దారి తప్పినట్లు తెలిసింది. రాత్రి కావడంతో ఆందోళన చెందిన వీరు.. ఫోన్ సిగ్నల్స్ రావడంతో మిత్రులకు సమాచారం అందించారు. మిత్రుల సలహా మేరకు లైవ్ సిగ్నల్స్ లోకేషన్ పంపించారు. వీరంతా అడవిలో తిరుగుతూ చివరకు రైల్వేకోడూరు అటవీ పరిధిలోని ఎస్.ఉప్పరపల్లి, ఎస్.కొత్తపల్లి ప్రాంతాల పరిధిలోకి రాగానే ఫోన్ సిగ్నల్స్ రావడంతో రేణిగుంట పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు రేణిగుంట పోలీసులు కోడూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ హేమసుందర్‌రావు ఆదేశాల మేరకు కోడూరు ఎస్‌ఐ నవీన్ బాబు తమ సిబ్బందితో అటవీశాఖ అధికారులతో కలిసి అడవిలో జల్లెడ పడుతున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే వారి ఆచూకీ త్వరగా లభిస్తుంది. తప్పిపోయిన విద్యార్థుల వివరాల కోసం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.


శేషాచలం అడవి నుంచి లైవ్ లొకేషన్ పంపిన విద్యార్థి

శ్రీసిటీలో ఎయిర్ స్ట్రిప్

● అవకాశాలు పరిశీలించాలని ఏవియేషన్ అధికారులకు సీఎం సూచన

తిరుపతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లో విస్తరించి ఉన్న శ్రీసిటీ సెజ్‌లో విమానాల రాకపోకలకు వీలు కల్పించేలా ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సివిల్ ఏవియేషన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్రంలోని ఎయిర్‌పోర్టుల అభివృద్ధి, కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, ఏపీ సివిల్ ఏవియేషన్ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలతోపాటు కొత్తగా ఏర్పాటు చేయాల్సిన ఎయిర్‌పోర్టులు, ఎయిర్‌స్ట్రిప్‌ల గురించీ ఆలోచించాలని సూచించారు. అందులో భాగంగా శ్రీసిటీ పరిధిలో ఎయిర్‌స్ట్రిప్ గురించి ప్రస్తావించారు. పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, విదేశీ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు రాకపోకలు సాగించడానికి వీలుగా శ్రీసిటీలో ఎయిర్‌స్ట్రిప్ అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆయన సివిల్ ఏవియేషన్ అధికారులకు సూచించారు.

ఆగస్టులోనే ప్రస్తావన

శ్రీసిటీ సెజ్ ఏర్పాటు చేసే సమయంలోనే ఎయిర్‌స్ట్రిప్ నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. సెజ్‌కోసం 10వేల ఎకరాల సేకరించాలని తొలుత ప్రతిపాదించగా 8వేల ఎకరాలు మాత్రమే ఇప్పటి వరకూ సేకరించారు. ఇంకా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి భూముల కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తొలినాటి ప్రతిపాదనలకు అనుగుణంగా మరో 2వేల ఎకరాల భూములు సేకరించి ఏపీఐసీసీ ద్వారా శ్రీసిటీకి అప్పగించాలని సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మూడవ నెలలోనే గత ఏడాది ఆగస్టు 19న శ్రీసిటీలో పర్యటించారు. ఆ సందర్భంలో ఎయిర్‌స్ట్రిప్ అంశం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. దానిపై సెజ్ యాజమాన్యం నుంచి పూర్తి వివరాలు తీసుకొని నివేదించాలని జిల్లా యాంత్రంగాన్ని సీఎం ఆదేశించారు. ఆతర్వాత ఎయిర్‌స్ట్రిప్ అవసరం, అవకాశాలు, ఇతర మౌళిక సదుపాయాల గురించిన వివరాలు కోరుతూ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఇటీవల శ్రీసిటీ యాజమాన్యానికి లేఖ రాశారు. వారి నుంచి స్పందన వచ్చిన తర్వాత ఎయిర్‌స్ట్రిప్‌పై మరింత స్పష్టత రానుంది.

నేటినుంచి జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం

చిత్తూరు సెంట్రల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు కానుంది. గత వైకాపా ప్రభుత్వం విస్మరించిన ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేస్తోంది. జిల్లాలోని 31కళాశాలల్లో 7989 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఫస్టియర్‌లో 4091 మంది కాగా, సెకండ్ ఇయర్‌లో 3898మంది చదువుతున్నారు.సోమవారం నుంచి శనివారం వరకు నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించనున్నారు. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు ప్లస్ 2 స్కూళ్లలోని ఇంటర్ విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.విద్యార్థులకు అవసరమైన పళ్లాలను, గ్లాసులను ప్రభుత్వం ఇప్పటికే పంపిణీ చేసింది. వంట బాధ్యతలను కళాశాలలకు సమీపంలోని ఉన్నత పాఠశాల భోజన పథకం నిర్వాహకులకు, లేదా స్వయం సహాయక బృందాలకు అప్పగించారు.

మెనూ ఇదీ

సోమవారం: అన్నం, కూరగాయల కూర, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
మంగళవారం: పులగం లేదా పులిహోర, పల్లీచట్నీ, కోడిగుడ్డు ఫ్రై, రాగిజావ.
బుధవారం: అన్నం, సాంబారు, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
గురువారం: కూరగాయల అన్నం (వెజిటబుల్ రైస్), గుడ్డుకూర, రాగిజావ.
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
శనివారం: అన్నం, కందిపప్పు చారు, బెల్లం పొంగలి, రాగిజావ.

మహిళల జీవితాల్లో 'వెలుగు'ల పండుగ!

ఈజీ మార్ట్.. ఈ సైకిళ్లు.. రూ.కోట్ల రుణాలు ● ముఖ్యమంత్రి పర్యటనలో పంపిణీకి సన్నాహాలు





కుప్పం మండలం గోనుగూరులో మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశమైన వెలుగు ఏపీఎం చంద్రశేఖర్ - ఈజీ మార్ట్‌కోసం ఎంపికైన గోనుగూరులోని కిరాణా దుకాణం



ఈ సైకిల్‌ను పరిశీలిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం మహిళామణులకు సంక్రాంతి వారం రోజుల ముందుగానే రానుంది.ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో వారి ఆర్థిక స్వావలంబనకు, కుటుంబాల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన పలు పథకాలను ప్రారంభించనున్నారు. ఈజీ మార్ట్, ఈ సైకిళ్లు, కోట్లాది రూపాయల రుణాల పంపిణీ వంటి కార్యక్రమాలకు డీఆర్డీయే వెలుగు ప్రాజెక్ట్ ద్వారా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కుప్పం వెలుగు ఏపీఎం చంద్రశేఖర్‌తో పాటు మిగిలిన 3 మండలాల ఏపీఎంలు ప్రస్తుతం ఇదే పనిమీద ఉన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ నిర్దేశకత్వంలో కుప్పం నియోజకవర్గ మహిళల స్వయం సమృద్ధికి ఒక పెద్ద అడుగు పడనుంది. మహిళల ఆర్థిక స్వయం సమృద్ధికోసం ఉద్దేశించి, ముఖ్యమంత్రి ప్రారంభించబోతున్న పథకాల వివరాలు ఇవీ.

● రూ.9 వేలకే ఈ సైకిలు

మహిళా సమాఖ్యల్లోని సభ్యులకు ఈ సైకిళ్ల పంపిణీ చేయనున్నారు. మొత్తం 300 సైకిళ్లను తొలి విడతలో పంపిణీ చేయడానికి నిర్ణయించారు. ఒక్కో సైకిలు అసలు ధర రూ.42 వేలు కాగా కుప్పం నియోజకవర్గంలోని మహిళా సమాఖ్యల సభ్యులకు రూ.9 వేలకే అందిస్తున్నారు. సైకిళ్ల ముందు భాగంలో ఫిట్ చేసిన క్యారేజీ ద్వారా తినుబండారాలు, అగరబత్తీలు, సోపులు వంటి వస్తువులను పెట్టుకుని గ్రామగ్రామానికీ తిరిగి విక్రయించే వెసులుబాటు ఈ సైకిళ్ల వల్ల కలుగుతుంది. తద్వారా చిరు వ్యాపారులకు అసరా దొరుకుతుంది.

● ఈజీ మార్ట్

ఈజీ మార్ట్ అనేది ఒక ప్రముఖ ఏజెన్సీ పేరు. ఈ ఏజెన్సీ 20 ప్రముఖ ఉత్పత్తి కంపెనీలతో సుమారు 2000 ఉత్పత్తులకు ఒప్పందం కుదుర్చుకుంది.ఆయా కంపెనీలనుంచి గ్రామీణ చిరు వ్యాపారులకు ఉత్పత్తులను నేరుగా చేరుస్తుంది. తద్వారా ఎమ్మార్పీ కంటే పదీ పన్నెండు శాతం తగ్గించి వినియోగదారుడికి అందించే వెసులుబాటు చిరు వ్యాపారికి దొరుకుతుంది. దీనివల్ల అటు గ్రామీణ వ్యాపారి, ఇటు వినియోగదారు లాభపడతారు. ఈజీ మార్ట్ అమలు చేయడానికి కుప్పం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లోని 250 దుకాణాలను లక్ష్యంగా ఎంచుకున్నారు.ఎంపిక చేసిన దుకాణాలకు ఈజీమార్ట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఇస్తారు. ఈ యాప్ ద్వారా తమకు అవసరమైన సరుకులను చిరు వ్యాపారులు,వినియోగదారులు కూడా ఆర్డర్ చేసుకోవచ్చు. అయితే వెలుగు గ్రామ సమాఖ్యలో సభ్యులైన మహిళలకు మాత్రమే ఈజీ మార్ట్‌లో భాగమయ్యే వీలు కలుగుతుంది.

● ఓఎన్‌డీసీ : ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) 'మై స్టోర్' అనే యాప్ ద్వారా పనిచేస్తుంది. గ్రామ సమాఖ్యల్లోని మహిళలు ఎవరైనా కిరాణా దుకాణాలు పెట్టుకుని ఉన్నా లేదా సొంతంగా ఇళ్లలోనే కుటీర పరిశ్రమల్లాంటివి నడుపుతున్నా ఈ యాప్‌ను వినియోగించుకోవచ్చు. ఓఎన్డీసీ యాప్‌లో ప్రస్తుతానికి 42 ఉత్పత్తులుంటాయి. ఈ ఉత్పత్తుల్లో ఎవరికి ఏ ఉత్పత్తి కావాలన్నా చిరు వ్యాపారులు, వినియోగదారులు కూడా ఆర్డర్ చేయొచ్చు. దగ్గరలో ఉండే కిరాణా దుకాణానికి ఆ ఉత్పత్తులను ఓఎన్డీసీ ప్రతినిధులు పంపుతారు. అక్కడికి వచ్చి వినియోగదారులు తీసుకువెళ్తారు. అంతేకాక, ఇళ్లల్లో మహిళలు కుటీర పరిశ్రమగా తయారు చేసే ఊరగాయలు, అగరబత్తీలు, పత్తి సంచులు, క్యారీ బ్యాగులు వంటివి కూడా యాప్‌లో పెట్టుకునే సౌకర్యం ఉంది. తద్వారా వ్యాపారాభివృద్ధి జరిగి లాభాలు పెరుగుతాయి. నియోజకవర్గంలో 173మంది చిరు వ్యాపారులను తొలుత ఓఎన్డీసీలో నమోదు చేయాలన్నది లక్ష్యం కాగా ఈ లక్ష్యం ఇప్పటికే దాదాపు పూర్తయింది.

● రూ.50 కోట్ల దాకా రుణాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో మహిళా సమాఖ్యలకు విరివిగా రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో కలిపి బ్యాంక్ లింకేజీ కింద రూ.45 కోట్ల వరకూ రుణాలు ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనితోపాటు ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రెన్యూర్ పేరుతో మహిళా సమాఖ్యల్లోని సభ్యులకు ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల దాకా అదనంగా రుణాలు మంజూరు చేయనున్నారు. కేవలం 50 పైసల వడ్డీకి ఇచ్చే ఈ రుణాల ద్వారా అప్పటికే చేస్తున్న వ్యాపారం లేదా ఇతర ఆర్థిక స్వావలంబన కార్యక్రమాలను మరింత వృద్ధి చేసుకునే వీలవుతుంది. నియోజకవర్గవ్యాప్తంగా 920మంది మహిళలకు ఈ రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. శ్రీనిధి కింద 6 శాతం వడ్డీతో మరో రూ.5 కోట్ల రుణాలు ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఓపీలో 10 శాతం మంది రోగులకు టీబీ పరీక్షలు తప్పనిసరి : డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పీహెచ్‌సీలకు ఓపీకి వచ్చే రోగుల్లో దగ్గు ఉన్న 10 శాతం మందికి టీబీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని డీఎంహెచ్‌వో సుధాకరాణి ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఆశ కార్యకర్త కూడా ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. 2025 పూర్తయ్యేలోపు టీబీ లేని జిల్లాగా మార్చడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే జ్వరాలున్న వారికి డెంగీ, మలేరియా పరీక్షలు చేయాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఎంవో అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణపై మాక్‌డ్రిల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

చిత్తూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ టారీఫ్ పెంపుపై ఈనెల 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం చిత్తూరులోని ఎస్ఈ కార్యాలయంలో మాక్‌డ్రిల్ జరిగింది. ఏపీఈఆర్సీ ఇన్‌చార్జి చైర్మన్ రాంసింగ్ విజయవాడ నుంచి ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈఈలు మునిచంద్ర, సురేష్, ఏవో ప్రసన్న ఆజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తడుకుపేటలో కొనసాగుతున్న ఉద్రిక్తత



కాలిపోయిన మోటార్ బైక్‌లు



నిరసన తెలుపుతున్న దళిత మహిళలు

నగరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి):నగరి మండలం తడుకుపేటలో గురువారం రాత్రి తలెత్తిన ఉద్రిక్తత అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఒక వర్గానికి చెందిన ఆరు మోటార్‌సైకిళ్లను తడుకుపేటలో ఉన్న గుడి సమీపంలో దగ్ధం చేశారు.వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య చోటు చేసుకున్న తగాదాలు కాస్త రెండు సామాజికవర్గాల మధ్య వివాదాలుగా మారడంతో బందోబస్తు పెంచారు. డీఎస్పీ సాయినాథ్, సీఐలు మహేశ్వర్, భాస్కర్, హనుమంతప్ప, శ్రీనివాసంతి, ఐదుగురు ఎస్ఐలు 45మంది పోలీసు బలగాలతో గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.తడుకు దళితవాడలో మహిళలు తమకు న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు.జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని , ఏకపక్షంగా ప్రచారం చేయడం తగదని, తమ వర్గీయులు 8మందికి సైతం గాయాలయ్యాయని పేర్కొన్నారు. రెండు వర్గాలకు చెందిన వారిపై కేసులు నమోదు చేసినట్లు , ఒక వర్గం వారిలో కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు.మరో వర్గానికి చెందిన 8మందికి గాయాలు కాగా శుక్రవారం ఉదయం వారిని నగరి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

49 మంది ఎండీయూ ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 49 మంది ఎండీయూ ఆపరేటర్లకు డిసెంబరు నెల జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా 5.45లక్షల రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతినెలా 1-17 తేదీల మధ్య నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేల జీతం, వారి సహాయకులకు రూ.3వేలను జీతంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. కాగా, డిసెంబరులో లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 49మంది ఆపరేటర్ల జీతాలను ఈనెల ప్రారంభంలో నిలిపేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

సావిత్రీబాయి పూలేకి భారతరత్న ఇవ్వాలి

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ డిమాండ్



పూలే నాణేన్ని ప్రదర్శిస్తున్న రామచంద్ర యాదవ్ , బ్రహ్మానందం, రేణుదేశాయ్ తదితరులు

పుంగనూరు/విజయవాడ(లబ్బీపేట), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రీ బాయి పూలేకి భారత రత్న ఇవ్వాలని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు.విజయవాడ నగరం బందర్ రోడ్డులోని లెమన్ ట్రీ హోటల్‌లో భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలు, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 125 మంది మహిళా ఉపాధ్యాయులకు బీసీవైపీ తరపున అవార్డులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళల విద్య కోసం సావిత్రి బాయి పూలే పరితపించారని అన్నారు.పూలే జయంతిని ప్రభుత్వాలు అధికారికంగా జరిపించాలని డిమాండ్ చేశారు.సామాజిక సేవకురాలు, సినీ నటి రేణు దేశాయ్ మాట్లాడుతూ సావిత్రీ బాయి పూలే జన్మించిన ప్రాంతంలోనే తాను జన్మించడం పట్ల ఎంతో గర్వంగా ఉందన్నారు. సినీనటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం నిర్వహించే అలోచన రావడమే గొప్ప విషయమన్నారు.అనంతరం సావిత్రి బాయి పూలే బొమ్మతో ఉన్న సిల్వర్ కాయిన్‌ను అవిష్కరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

లాయర్ల సంఘం అధ్యక్షుడిగా శంకర్ నాయుడు

కార్యదర్శిగా సురేష్ రెడ్డి



ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎన్నికల అధికారి వసంత్ కుమార్ - నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు లీగల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు న్యాయవాదుల సంఘానికి జరిగిన ఎన్నికల్లో కె.శంకర్ నాయుడు అధ్యక్షుడిగా గెలుపొందారు. అధ్యక్ష పదవికోసం ఐదుగురు పోటీపడగా.. పూతలపట్టు మండలం ఆకనంబట్టు గ్రామానికి చెందిన శంకర్ నాయుడు మిగిలిన నలుగురిపై 74 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వైస్ ప్రెసిడెంట్‌గా పూతలపట్టు మండలం వజ్జిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన భూప్రసన్న గెలుపొందాడు. సెక్రటరీగా సి.సురేష్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించగా, జాయింట్ సెక్రటరీగా జీఎం షఫీవుల్లా, ట్రెజరర్‌గా ఎస్.ఆనందన్, లైబ్రరీ సెక్రటరీగా ఎం.రవిచంద్రన్, కల్చరల్ సెక్రటరీగా కేఎం రాజచంద్ర యాదవ్, స్పోర్ట్స్ సెక్రటరీగా సి.సుబ్రహ్మణ్యం విజేతలుగా నిలిచారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పి.చిన్నబ్బ, కె.తులసీరామ్, శరవణ, రవికుమార్, అక్బర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది జి.వసంత్‌కుమార్ వ్యవహరించారు.

నాల్గవ రోజున 'మహిళా కానిస్టేబుల్' ఎంపిక ప్రక్రియ



పరుగు పందెంలో అభ్యర్థినులు - అభ్యర్థినుల ఎత్తును కొలుస్తున్న పోలీసు అధికారులు

చిత్తూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నాల్గవ రోజు కూడా చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో కొనసాగింది. శుక్రవారం 495 మంది మహిళా అభ్యర్థులకు 283 మంది హాజరవగా, 81 మంది అర్హత సాధించారు. ఈ ప్రక్రియను ఎస్పీ మణికంఠ పర్యవేక్షించారు. అభ్యర్థినుల సర్టిఫికెట్ల పరిశీలన, ఫిజికల్ మెజర్మెంట్‌లో భాగంగా ఎత్తు, ఛాతీ కొలతలు తీయగా, 81 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఏపీస్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాలతో ఈ పరీక్షలను పటిష్ఠంగా నిర్వహించారు. పరుగుపందెంలో అలసిన అభ్యర్థినులకు వైద్యులు ప్రథమచికిత్స చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, టౌన్ డీఎస్పీ సాయినాథ్, తిరుపతి మహిళా డీఎస్పీ శ్రీలత, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాష, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎంపీడీవో తీరుపై శ్రీహరిపురంవాసుల ధ్వజం



శ్రీహరిపురంలో తనిఖీ చేస్తున్న డీఎల్‌డీవో ఖాదర్ బాషా

విజయపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విజయపురం ఎంపీడీవో తీరుపై శ్రీహరిపురం వాసులు శుక్రవారం ధ్వజమెత్తారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకే సచివాలయానికి తాళం వేసి సిబ్బంది విధులకు డుమ్మా కొట్టారని ఎంపీడీవో రమణ ప్రకాష్ చెప్పడం అవాస్తవమని మండిపడ్డారు. కోతుల బెడద వల్ల సచివాలయానికి చిలు కు పెట్టి.. పన్నులు వసూలుకు సిబ్బంది గ్రామంలోకి వెళ్లినప్పుడు ఆయన తనిఖీకి వచ్చారన్నారు. సిబ్బంది ద్విచక్ర వాహనాలు కూడా కార్యాలయ ఆవరణలోనే ఉన్నాయని చెప్పారు. అయినా ఎక్కడికి వెళ్లారంటూ మద్యం మత్తులో చిందులు తొక్కుతూ సచివాలయానికి ఎంపీడీవోనే స్వయంగా తాళం వేశారని ఆరోపించారు. విషయం తెలుసుకుని వచ్చిన సిబ్బందిని నానా మాటలు అన్నారన్నారు. తామంతా ఏకమవడంతో వేరే వ్యక్తి ద్వారా బీగాలు పంపారని, సాయంత్రం 6.30 గంటలకు సిబ్బంది తమ బ్యాగులు తీసుకుని ఇళ్లకు బయల్దేరారని తెలిపారు. ఈ విషయమై టీడీపీ నాయకులతో కలిసి జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

డీఎల్‌డీవో తనిఖీ

శ్రీహరిపురం సచివాలయాన్ని శుక్రవారం నగరి డీఎల్‌డీవో ఖాదర్‌బాషా తనిఖీ చేశారు. సిబ్బంది, స్థానికులతో మాట్లాడి సమాచారం సేకరించారు. నివేదికను జడ్పీ సీఈవోకు అందజేస్తామని తెలిపారు.

8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య!

వెదురుకుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఇంతకీ ఆ చిన్నారికి ఉరేసుకుని చనిపోవాలనుకునేంత కష్టం ఏమొచ్చిందో ఎవరికీ అర్థం కావడం లేదు.కార్వేటినగరం మండలం కత్తెరపల్లికి చెందిన హేమంత్ కుమార్ (13) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం బడికి వెళ్లి మధ్యాహ్న భోజనానికి ఇంటికి వచ్చాడు.టైలరింగ్ పనిలో నిమగ్నమైన అతడి తల్లి పిల్లాడి అలికిడి లేదేమని ఇంట్లోకి వెళ్లి చూస్తే హేమంత్ కుమార్ ఫ్యానుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కిందకు దించారు. అప్పటికే చనిపోయిన ఆ విద్యార్థి ఆత్మహత్యకు కారణం మాత్రం బయటికి రాలేదు.

చిరుత దాడిలో మేక మృతి



మేక కళేబరం

బంగారుపాళ్యం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలికి సమీపంలో గౌనిచెరువు వద్ద శుక్రవారం సాయంత్రం చిరుత దాడిలో ఓ మేక మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గౌనిచెరువు సమీపంలో చిన్నబ్బ నివాసముంటూ మేకలు మేపుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజులాగానే మేకలు తోలుకుని కౌండిన్య అభయారణ్యంలోకి వెళ్లి మేపుతుండగా చిరుత మందపై దాడి చేసింది. ఓ మేక గొంతుపట్టుకుని తీసుకెళుతుండగా సమీపంలోని కాపరులు గమనించి.. అరుస్తూ చిరుతను వెంబడించారు. దాంతో మేకను చిరుత వదిలేసి, వెళ్లిపోయింది. అప్పటికే మేక చనిపోయింది. ఆరు నెలల క్రితం కూడా సుమారు 15 మేకల వరకు చిరుతల దాడిలో మృతి చెందినట్లు చిన్నబ్బ ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం

చిత్తూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధులను మెరుగుపరడంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో హోం ట్రయాంగిల్ యాప్ సంస్థతో కలిసి సేవలందించేందుకు సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణాల్లోని గృహాలకు ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వడ్రంగి వంటి సేవలు అందించేందుకు వీలుగా సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించి రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించేందుకు వీలుగా ఈ యాప్ పనిచేస్తుందన్నారు. పూర్తి వివరాలకు చిత్తూరు నగరపాలక సంస్థలోని మెప్మా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు


టీడీపీలో చేరిన వారితో పీఎస్ మునిరత్నం, ప్రేమ్‌కుమార్

కుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు, సానుభూతిపరులు భారీగా టీడీపీలో చేరారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. ఏపీ ఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం 20 మందికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం ప్రజలందరూ ఒక్కటేనని.. కులమత వర్గాలకు అతీతంగా అందరూ అభివృద్ధి చెందాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే రాగద్వేషాలకు అతీతంగా అందరినీ కలుపుకుని, అభివృద్ధివైపు పయనిస్తున్నామన్నారు. పార్టీలో నిజాయితీగా పనిచేసే అందరికీ గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రామచంద్ర, యూనిట్ ఇన్‌చార్జి మోహన్, దామోదర్, నాయకులు చంద్ర, రమేశ్, వెంకటేశ్, తులసి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



కుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో కుప్పం పట్టణానికి చెందిన కేవీ శ్రీదేవికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేశారు. శ్రీదేవి కుప్పంలోని పాతపేట మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. అవార్డు అందుకున్న ఆమెను సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

సర్వే రాళ్లపై జగన్ పేరు తొలగింపు


రాళ్లపై పేర్ల తొలగింపును పరిశీలిస్తున్న తహసీల్దారు సీతారామ్

గుడుపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయంలో గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టింది. అనంతరం హద్దులలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరు ఉండేలా సర్వే రాళ్లను అధికారులు ఏర్పాటు చేయించారు. ప్రజల నుంచి రీసర్వేపై అనేక ఫిర్యాదులు వెళ్లువెత్తాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సర్వే రాళ్లపై ఏర్పాటు చేసిన పేర్ల తొలగింపునకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన సర్వే రాళ్లపై ఉన్న పేర్ల తొలగింపు కార్యక్రమాన్ని తహసీల్దారు సీతారామ్ శుక్రవారం గుండ్లసాగరంలో పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలతో సర్వే రాళ్లపై పేర్ల తొలగింపు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ రత్నప్ప, వీఆర్వో పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా జగదీష్‌రాజు


జగదీష్‌రాజును సత్కరిస్తున్న నాయకులు

పుంగనూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పుంగనూరు పట్టణ అధ్యక్షుడిగా జగదీష్‌రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ నాయకులు విశ్వనాథనాయుడు, డిష్ రాజారెడ్డి తెలిపారు. శుక్రవారం రాంపల్లెలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఏకగ్రీవంగా పట్టణ అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. బీజేపీలో యువతకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడపగడపకు అందేలా నాయకులు, కార్యకర్తలు పని చేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరిచేలా ప్రతి కార్యకర్త బీజేపీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. నూతన అధ్యక్షుడు జగదీష్ రాజును సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నెరవేర్చి పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని చెప్పారు. సమావేశంలో నియోజక కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు, నాయకులు అయూబ్‌ఖాన్, మల్లికారాణి, నరసింహులు, నానబాల కుమార్, బాబు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మల్లెలమిట్ట ప్రాజెక్టు పనుల తనిఖీ


పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్‌ఈ విజయకుమార్‌రెడ్డి

రొంపిచెర్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గానుగచింత పంచాయతీలోని మల్లెలమిట్ట ప్రాజెక్టు పనులను శుక్రవారం ఇరిగేషన్ ఎస్‌ఈ విజయకుమార్‌రెడ్డి, ఈఈ వీఎంసీ గిరిధర్, డీఈ రాజేంద్రబాబు తనిఖీ చేశారు. పంట కాలువలు, కల్వర్టు పనులు పరిశీలించారు. అలాగే మండలంలోని బోడిపాలివారిపల్లె, గానుగచింత, బొమ్మయ్యగారిపల్లె, చెంచమరెడ్డిగారిపల్లె పంచాయతీలో జరుగుతున్న చెరువులు, మొరవ, కాలువల పనులు పరిశీలించి పనులను నాణ్యతతో త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నీటిపారుదశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

● రూ. 5 లక్షల స్ల్పెండర్ బైకుల స్వాధీనం



వి.కోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్‌కు చెందిన వశీం(25), ప్రేమ్‌కుమార్ (26) అనే అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, వి.కోట సీఐ సోమశేఖర్ తెలిపారు. వీరి వద్ద రూ.5 లక్షలు విలువైన పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. శుక్రవారం పట్టణంలోని దుర్గానగర్ ప్రాంతంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ యువకుడు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. అనుమానంతో అతడిని పట్టుకుని విచారించగా గతంలో వి.కోట కేజీఎఫ్ బస్టాండులో చోరీకి గురైన ద్విచక్ర వాహనంగా తేలింది. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. వి.కోట పరిసరాలలో తరచూ ద్విచక్రవాహనాలను చోరీ చేసుకెళుతున్నట్లు అంగీకరించాడు. సమాచారం మేరకు తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్‌లోని నిందితుడి ఇంటి వద్ద ఉన్న ఓ లారీ షెడ్డులో నాలుగు ద్విచక్ర వాహనాలను రికవరీ చేశారు. అలాగే స్నేహితుడు ప్రేమ్‌కుమార్ ఇంటి వద్ద అమ్మకానికి ఉంచిన మరో ఆరు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రాలో ద్విచక్ర వాహనాలను దొంగలించి తమిళనాడులో విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర దొంగలు వశీం, ప్రేమ్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండుకు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇంటర్ వర్శిటీ చెస్ టోర్నమెంట్‌కు కేడీసీ విద్యార్థి


జగపతిని అభినందిస్తున్న కేడీసీ వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్

కుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థి సి.జగపతి ఇంటర్ యూనివర్శిటీ చెస్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. తిరుపతిలో ఇటీవల జరిగిన చెస్ టోర్నమెంట్ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. తమిళనాడులో జనవరి 8 నుంచి జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్‌లో జగపతి పాల్గొనన్నారు. జగపతిని కుప్పం డిగ్రీ కళాశాల ఛైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్‌లు శుక్రవారం అభినందించారు. అతనికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధారాణిని ప్రశంసించారు.

గాండ్ల కులస్థుల అభివృద్ధికి కృషి

● పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో గాండ్ల కులస్థుల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరులోని ఓ మండపంలో జరిగిన గాండ్ల సంఘం ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాండ్ల కులస్థులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా మంచి జరిగేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటారని పేర్కొన్నారు. మునీశ్వరస్వామి గుడి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఈ సందర్భంగా గాండ్ల సంఘం ముద్రించిన ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాండ్ల సంఘం నాయకులు మాజీ ఎంపీపీ ఆర్.రాజేంద్ర, టీకే షణ్ముగం, ఆర్బీసీ కుట్టి, మున్సిపల్ కౌన్సిలర్ కోదండరామయ్య, అమరేంద్రబాబు, మురళీకృష్ణ, జగన్‌మోహన్, గురు, వెంకటాచలం, గణేష్, మూర్తి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన అధికారులను తొలగించాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న బీసీ ఫ్రంట్ నాయకులు గోవిందస్వామి తదితరులు

పలమనేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మద్యం తాగి దాడులకు పాల్పడిన గంగవరం, పెద్దపంజాణి తహసీల్దార్లను ఉద్యోగాల నుంచి తొలగించాలని కోరుతూ శుక్రవారం బీసీ ఫ్రంట్ నాయకులు ఆర్డీవో పి.భవానికి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరించేవారని.. వారిని శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ నాయకులు గోవిందస్వామి, దేరంగుల సుబ్రహ్మణ్యం, వికలాంగుల సేవా సమితి అధ్యక్షులు చిన్నగురప్ప, నంజుండప్ప, శ్రీనివాసులు, ఎం.బాలసుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, ఎల్లప్ప, సుబ్రహ్మణ్యం, శివ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు


వ్యక్తి అరెస్టును చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పుంగనూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం పత్రపల్లె బస్టాప్ వద్ద కర్ణాటక మద్యం ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.సురేశ్‌రెడ్డి తెలిపారు. పుంగనూరుకు చెందిన ఎస్.సయ్యద్ అష్రఫ్ అలీ(32) ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేయగా అతని వద్ద రూ.6,300 విలువైన కర్ణాటక టెట్రా ప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే పత్రపల్లె వద్ద సారా తయారీకి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జవహర్‌బాబు, పుంగనూరు ఎక్సైజ్ ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్లకు మహర్దశ


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

సోమల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సీసీ రోడ్లకు నిధులు మంజూరుతో మహర్దశ కలిగిందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలో జరుగుతున్న పలు సీసీ రోడ్లను ఎంపీడీవో నారాయణ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కందూరు, కామిరెడ్డివారిపల్లెలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, బాలకృష్ణమనాయుడు, ఏపీవో దినకర్‌బాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లసాగరంలో పారిశుధ్య పనులు

గుడుపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండ్లసాగరం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరిగాయి. గ్రామాల్లోని వీధుల్లో పేరుకుపోయిన చెత్త దిబ్బలను తొలగించారు. కాలువల్లో మురుగు, చెత్త తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం స్ఫూర్తిదాయకం

ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం


పలమనేరులో ఎంఈవో లీలారాణిని సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు


చౌడేపల్లిలో నివాళులర్పిస్తున్న మహిళా ఉపాధ్యాయులు


రొంపిచెర్లలో నివాళులర్పిస్తున్న టీడీపీ బీసీ నాయకులు

సదుం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళలందరికీ సావిత్రిబాయి పూలే జీవితం స్ఫూర్తిదాయకమని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఆమె జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, సందీప్ రెడ్డి, విశ్వనాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● చౌడేపల్లె: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం నాగరాజ రెడ్డి, ఉపాధ్యాయులు భారతి, ప్రతిమ, పూర్ణిమ, విజయలక్ష్మి, కవిత, స్వర్ణలత, అరుణ కుమారి, ఉమా, అరుణ, కళ్యాణభారతి తదితరులు పాల్గొన్నారు. ● పలమనేరు: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పలమనేరు సీఐటీయూ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేవీపీఎస్ నాయకులు అన్నూరు ఈశ్వర్, సీపీఎం జిల్లా కమిటి సభ్యులు ఓబుల్‌రాజు, గిరిధర్‌గుప్తా, పాదం సుబ్రహ్మణ్యం, పాకాల సుబ్రమణ్యం, ఎల్లప్ప, రాజా, జయంతి, ధనమ్మ, నందిని, లక్ష్మయ్య, సరోజమ్మ పాల్గొన్నారు. ● బీసీ, ఓబీసీ సంఘం జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు లక్ష్మీపతియాదవ్ ఆధ్వర్యంలో పలమనేరులో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఈవో లీలారాణి, మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సీఐ నరసింహరాజు, ఓన్టీవో సంఘ పలమనేరు తాలూక అధ్యక్షులు ఆనందబాబు, బీసీ నాయకులు ఆర్బీసీ కుట్టి, పూసల రవి, పురుషోత్తం, ప్రదీప్, బాలసుబ్రహ్మణ్యం, స్వతంత్ర్యబాబు, లోకేష్ ఆచారి, ఈశ్వర్, ప్రకాష్, కృష్ణప్ప, గురప్ప, సోమశేఖర్, గిరిబాబు, నాగరాజు, మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●రామకుప్పం: బగళనత్తం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

● సోమల: సావిత్రిబాయి పూలే జయంతిని రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ పీవో గౌతం, అధ్యాపకులు రామకృష్ణ, శివయ్య, రవీంద్ర, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ నాయక్, సుధ, నాగరత్నమ్మ, లక్ష్మీ, శ్రీకాంత్, గీతాంజలి, పుష్పకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: రొంపిచెర్ల బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను టీడీపీ జాతీయ బీసీ నాయకుడు బంగారు నారాయణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు మునికృష్ణ, చంద్రశేఖర్, రాజన్న, సుబ్రహ్మణ్యం, నారాయణరెడ్డి, రఘునాథ్, బాబు, రామచంద్ర, చిన్ననాగరాజ తదితరులు పాల్గొన్నారు.

●పుంగనూరు రూరల్: స్థానిక ఇందిరా సర్కిల్‌లోని పూలే విగ్రహానికి పలువురు నాయకులు పపపణపపపపపపపఊపూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, షబానా, చిట్టెమ్మ, శ్రీనివాసులు, శివప్రసాద్, చైత్ర, ప్రతిభ భారతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె కస్తూరిబా పాఠశాలలో శుక్రవారం ఎండీహెచ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎండీహెచ్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ పవన్‌కల్యాణ్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●గంగవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా వి.కోటలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాధం నాయుడు సంస్థ కార్యదర్శి పుష్ప, యల్లంపల్లి నరేంద్రబాబు, చంద్రశేఖరయ్య, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మంత్రుల బృందంలో చల్లా బాబు



పుంగనూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉగాది నుంచి ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు పథకం నిర్వహణపై రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం, అధికారులు కర్ణాటకలో అధ్యయనం చేశారు. శుక్రవారం రాష్ట్ర రవాణా, యువజన సంక్షేమ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, రాష్ట్ర రవాణాశాఖాధికారి కాంతిలాల్‌దండే తదితరులు బెంగళూరు బస్టాండ్‌లో పరిశీలించి అక్కడ నిర్వహణ, అమలు, స్థితిగతులపై చర్చించారు.

మంత్రులను కలిసిన చౌడేపల్లె నాయకులు

చౌడేపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మంత్రి రాంప్రసాద్ రెడ్డి, హోం మంత్రి అనితలను టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మణరాజు, టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి శుక్రవారం బెంగళూరులో కలిశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు కోసం కర్ణాటక రాష్ట్రం అమలుపై అధ్యయనానికి రావడంతో వారిని కలిశారు. సీఎం చంద్రబాబునాయుడు ఉగాదికి ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



చౌడేపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటిపేరి పంచాయతీ అగిస్థిగానిపల్లె వద్ద రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం గుర్తు తెలియని వాహ నం ఢీకొంది. విద్యుత్ స్తంభం విరిగి ప్రమాదకరంగా కూలిపోయే పరిస్థితిలో ఉంది. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్యూఆర్ కోడ్‌తో కరెంట్ బిల్లుల చెల్లింపు

సోమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఈనెల బిల్లుతో పాటు బిల్లులోనే క్యూఆర్ కోడ్ స్కానర్ ఇస్తున్నారని.. స్కాన్ చేసి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌ల నుంచి బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకొని సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన శ్రీవిరూపాక్షి మారెమ్మ శుక్రవారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు అభిషేకాలు చేపట్టారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

దోమల నివారణకు చర్యలు


నీటి నిల్వలను తొలగిస్తున్న సబ్‌యూనిట్ అధికారి జయశంకర్

పలమనేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని పలమనేరు సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ సూచించారు. శుక్రవారం పలమనేరులోని అంబేద్కర్ నగర్, వేణుగోపాలస్వామి వీధుల్లో ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వల కారణంగా దోమలు విపరీతంగా వృద్ధి చెందుతాయనారు. మలేరియా, డెంగీ వంటి విష జ్వరాల బారిన పడుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణవేణి, సుజాత, ఆశ కార్యకర్తలు, వసంత, నీలమణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

12లోపు టీడీపీ సభ్యత్వాలు పూర్తిచేయాలి

రొంపిచెర్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 12వ తేదీలోపు పూర్తి చేయాలని రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టరు, రొంపిచెర్ల మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ అన్నారు. శుక్రవారం రొంపిచెర్లలో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 50 వేలకు పైగా సభ్యత్వాలు తీసుకున్నారని.. కొన్ని మండలాల్లో ఇంకా చేయాల్సి ఉందన్నారు. సదుం మండలంలో 1,176, పుంగనూరు పట్టణంలో 5,962, పుంగనూరు రూరల్ 10,703, చౌడేపల్లిలో 7,668, పులిచెర్లలో 8,301, సోమలలో 9,698, రొంపిచెర్లలో 6,708 సభ్యత్వాలు చేశారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఇకపై సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని కోరారు. సమావేశంలో శ్రీనివాసులురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అమరనాథ రెడ్డి, బాబునాయుడు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరి పరిస్థితి విషమం


గాయపడిన వెంకటరెడ్డి, సురేష్‌రెడ్డి

రామకుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు గ్రామం రాజుపేట క్రాస్‌లో ఓ ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. రామకుప్పం మండలం క్రిష్ణమనాయనపల్లెకు చెందిన వెంకటరెడ్డి(45), గెర్నిపల్లెకు చెందిన సురేష్‌రెడ్డి(46) శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంలో కుప్పం బయలుదేరారు. మార్గమధ్యలో కర్ణాటక సరిహద్దు గ్రామం రాజుపేటక్రాస్ సమీపంలో కుప్పం వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వెంకటరెడ్డి, సురేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో క్షతగాత్రులను కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు సమాచారం.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

టూరిజం హబ్‌గా కైగల్ అభివృద్ధికి చర్యలు

● రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


రెవెన్యూ సదస్సులో వినతులు తీసుకుంటున్న తహసీల్దార్ రాము

బైరెడ్డిపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైగల్ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుచేసి టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. కైగల్ గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రెవెన్యూ సమస్యలు అధికమయ్యాయని తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం జరిగిందన్నారు. భూముల రీసర్వే పేరుతో గతంలో ఎన్నో అవకతవకలు జరిగాయని.. పాసుపుస్తకాలపై జగన్ బొమ్మలు ముద్రించి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు. ప్రజల్లో నెలకొన్న భయాందోళన పోగొట్టడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కైగల్ ప్రాంతంలో భూసమస్యలు అధికంగా ఉన్నాయని.. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కైగల్‌లో అర్హులైన వారందరికీ ఇళ్లపట్టాలు, పక్కాగృహాలు మంజూరు చేస్తామన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రామసముద్రం రహదారి పనులు త్వరలో పూర్తిచేస్తామని తెలిపారు. కైగల్ ప్రాజెక్టుపనులు చేపట్టి హంద్రీ-నీవా అనుసంధానంతో తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కైగల్ ప్రాంతంలో అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని, అన్యాక్రాంతమైన వేణుగోపాలస్వామి ఆలయ భూములను పరిరక్షించాలని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవరాజు, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

●పుంగనూరు రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పుంగనూరు తహసీల్దార్ రాము కోరారు. శుక్రవారం మండలంలోని వనమలదిన్నెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు చలపతినాయుడు, చిన్నమోహన్ నాయుడు, కవిత, రైతులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●రామకుప్పం: వైసీపీ అరాచక పాలనలో అన్నదాతలు అవస్థల పాలయ్యారని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధి మణీంద్రం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. తహసీల్దారు బాబు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ బాలాజీ, ఆర్ఐ నారాయణప్ప, ఆత్మ మాజీ డైరెక్టర్ రామలింగారెడ్డి, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు మంజునాథరెడ్డి, వడ్డెర సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు భానుమూర్తి, ఐటీడీపీ జిల్లా అధికార ప్రతినిధి జ్ఞానశేఖర్‌రెడ్డి, నేతలు శ్రీరాములు రెడ్డి, చిరంజీవి, మోహన్‌బాబు పాల్గొన్నారు.

●వి.కోట: పాపేపల్లె గంగమాంబ ఆలయం, అంబేడ్కర్ నగర్ సచివాలయాల వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. కార్యక్రమంలో తహసీల్దారుతో పాటు ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, నాయకులు రాంబాబు, చౌడప్ప, నాసీర్, రుహుల్లా, కమల్‌రాజు, ఉదయ్‌రాజు, ఆర్ఐ మోహన్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కోసం ఆరు కిలోమీటర్లు వెళ్లాల్సిందేనా?

చెరువులో నీరుంటే నిత్యావసరాలకు అవస్థలు

ఆవలాపురం ఇందిరానగర్ ముస్లిం కాలనీవాసుల ఆవేదన



చెరువు నీటిలో నిల్చొని సమస్యను తెలియజేస్తున్న ముస్లింలు

గంగాధరనెల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చింతారెడ్డిపల్లె రేషన్‌షాపు నుంచి తమ గ్రామానికి చెందిన బియ్యం కార్డులను విడదీసి తమకే షాపు కొత్తగా కేటాయించాలని ఆవలాపురం ఇందిరానగర్ ముస్లిం కాలనీవాసులు కోరుతున్నారు. వింజం పంచాయతీలోని చింతారెడ్డిపల్లెలో రేషన్‌షాపులో సుమారు 500 మంది కార్డుదారులు నిత్యావసర సరుకులు తీసుకుంటున్నారు. ఈ షాపు పరిధిలో ఆవలాపురం, ఆవలాపురం ఇందిరానగర్ ముస్లిం కాలనీకి చెందిన 250 కుటుంబాలు వారున్నారు. గతంలో ఈ గ్రామం నుంచి చెరువు మీదుగా రెండుకిలోమీటర్ల దూరంలో ఉండే చింతారెడ్డిపల్లెలోని షాపుకు వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకునే వారు. వర్షాలు కురిసి చెరువు నిండితే నిత్యావసరాలకు ఇబ్బందులు తప్పడం లేదు. చెరువులో నీళ్లుంటే మాత్రం చుట్టూ తిరిగి ఆరు కిలోమీటర్లు వెళ్లాల్సిందే. ఐదేళ్లుగా చెరువులో నీళ్లు తగ్గక పోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ బడికే పిల్లలను పంపండి

విద్యార్థుల తల్లిదండ్రులను కోరిన టీడీపీ నేత రమేష్



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రమేష్

పాలసముద్రం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ బడికే పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులను నరసింహాపురం టీడీపీ నాయకుడు రమేష్ శుక్రవారం కోరారు. టీవీఎస్ఆర్ పురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల సుమారు 30 ఏళ్లుగా ఉంది. ఏడాది కిందట వరకు కూడా ఇక్కడ 1-5 తరగతుల్లో 35 మంది విద్యార్థులు చదువుకునే వారు. ఉపాధ్యాయులు సక్రమంగా బోధించడం లేదన్న కారణంతో 16 మందిని వారి తల్లిదండ్రులు.. ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఓ టీచర్‌ని వేరే పాఠశాలకు బదిలీ చేసింది. ఏకోపాధ్యాయుడు కావడం, ఆయన అంధుడు కావడంతో పిల్లల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. దీనిపై స్థానికులు కలెక్టర్, డీఈవోను పలుమార్లు కలసి తమ సమస్యను తెలియజేసినా మార్పు రాలేదు. ఈ క్రమంలో మిగిలిన పిల్లలను కూడా ప్రైవేటు పాఠశాలకు పంపుతామని ఎంఈవో రాజేంద్రప్రసాద్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు.. రమేష్‌తో కలిసి వెళ్లి తెలిపారు. మూడ్రోజుల తర్వాత మరో టీచర్‌ని డిప్యుటేషన్‌పై పంపే ఏర్పాటు చేస్తామని ఎంఈవో అన్నారు. ఈ విద్యాసంవత్సరం పూర్తయ్యేలోపు అవసరమైన ఉపాధ్యాయులు వస్తే తమ పిల్లలను ఈ పాఠశాలలోనే చేర్పిస్తామని తల్లిదండ్రులు స్పష్టం చేశారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు విరాళం పత్రాన్ని అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

ఐరాల(కాణిపాకం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన శకుంతల రూ.1,00,116 శుక్రవారం విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామి సేవలో ప్రముఖులు: కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎస్.హేమలేఖ, రాష్ట్ర ఖాదీ గ్రామీణగ్రామీణ పరిశ్రమల చైర్మన్ కోటేశ్వరచౌదరి కుటుంబ సమేతంగా శుక్రవారం వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు పాల్గొన్నారు.

మద్రాస్ ఐఐటీలో ఐరాల విద్యార్థులు



ఐరాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ ఐఐటీని శుక్రవారం ఐరాలలోని సెయింట్ స్టీఫెన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ ఉషాకిరణ్ మాట్లాడుతూ.. స్టెమ్ ఎడ్యుకేషన్ ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యా అవకాశాలు కల్పించేందుకు తమ పాఠశాల ద్వారా ఈ ప్రయత్నం చేసినట్లు తెలిపారు. మద్రాసు ఐఐటీలోని రాకెట్ సైన్స్, ఓషన్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ తదితర ప్రయోగశాలలను సందర్శించినట్లు వివరించారు.

పిచ్చిగుంట్ల ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం: ట్రైనీ కలెక్టర్



పిచ్చి గుంట్లవాసులతో మాట్లాడుతున్న హిమవంశీ

గంగాధరనెల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పిచ్చిగుంట్ల ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ తెలిపారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీకి సమీపంలో తాత్కాలిక గుడిసెల్లో నివసిస్తున్న పిచ్చిగుంట్ల కుటుంబాల జీవన పరిస్థితిని శుక్రవారం ఆయన పరిశీలించారు. సీడ్ సర్వే కార్యక్రమంలో పిచ్చిగుంట్ల కుటుంబాలకు అవసరమైన ఇంటిస్థలాలు, తాగునీటి, విద్యుత్ సౌకర్యం, రేషన్‌కార్డు, కొత్త పింఛన్ల గురించి ఇదివరకే మండల అధికారులు ఆన్‌లైన్‌లో పంపించారని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి, త్వరలోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు చంద్ర, అమల, కిరణ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి: మురళీమోహన్

పూతలపట్టు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను అధికారులు వేగవంతం చేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం పూతలపట్టు చెరువు వాకింగ్ ట్రాక్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఉపాధి పథకానికి సంబంధించిన పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడుతూ.. పనులు మంజూరైనా కూలీలకు ఎందుకు పనులివ్వడం లేదని నిలదీశారు. సీఎం చంద్రబాబు నిధులు మంజూరుచేస్తున్నా.. అలసత్వంచూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతోపాటు ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని కోరారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఇంద్రసేన నాయుడు, నాయకులు రెడ్డెప్ప నాయుడు, రజినీ, గుంటూరు మురళి, హరి, యువరాజు నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ నాయకురాలికి నివాళి

యాదమరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కోడిగుట్టకు చెందిన టీడీపీ నాయకురాలు, మాజీ సర్పంచ్ సుజాత ఆకస్మిక మృతిపై పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం సుజాత స్వగృహానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రటీ, నాయకులు అవినేని మాధవ నాయుడు, వల్లేరు అమర్‌నాథ్ నాయుడు, సతీష్ నాయుడు బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుజాత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఓంశక్తి భక్తులకు ఉచితంగా బస్సు

గుడిపాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉన్నా లేకున్నా ప్రజాసేవే లక్ష్యంగా జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ లక్ష్యమని నిర్వాహకుడు గురజాల చెన్నకేశవులు నాయుడు అన్నారు. శుక్రవారం రెట్టగుంట నుంచి మేల్‌మరువత్తూరుకు వెళ్తున్న ఓంశక్తి భక్తులకు చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ ఆధ్వర్యంలో ఉచితంగా బస్సును ఏర్పాటు చేశారు. గుడిపాల, చిత్తూరు రూరల్, చిత్తూరు అర్బన్ నుంచి 150 బస్సులను ఓంశక్తి భక్తులకోసం ట్రస్టు ద్వారా పంపిస్తున్నామన్నారు.

ప్రభుత్వ బడుల అభివృద్ధే ధ్యేయం

వెదురుకుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల అభివృద్ధే ధ్యేయంగా పాఠశాలల యాజమాన్య కమిటీలు ఉండాలని కార్వేటినగరం ఎంపీపీ లత అన్నారు. శుక్రవారం కార్వేటినగరంలో పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులు, చైర్మన్లకు శిక్షణ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు విజయకుమార్, డీపీ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

పాలసముద్రం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వెంగళరాజుకుప్పం, శ్రీకావేరిరాజుపురం సచివాలయాలను శుక్రవారం ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి తనిఖీ చేశారు. ఉద్యోగులు తప్పని సరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని ఆదేశించారు. ఈవోపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





శిథిలావస్థలో భవనం





భవనానికి బీటలు

ఏ నిమిషానికి ఏమి జరుగునో..?

కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి ఇది

వెదురుకుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే వైద్యులు, ఉద్యోగులతో పాటు రోగులు కూడా ఏ నిమిషానికి ఏమి జరుగునో అంటూ భయపడుతున్నారు. ఎందుకంటే ఈ కేంద్రం నడుస్తున్న భవనాలు శిథిలావస్థకు చేరుకుని, ప్రమాదకరంగా ఉన్నాయి. పేరుకే 50 పడకల ఆస్పత్రి. 12 మంది వైద్యులు ఉండాల్సి ఉంటే.. ప్రభుత్వం పది మందినే నియమించింది. ప్రస్తుతం నలుగురే విధులు నిర్వహిస్తున్నారు. మిగతా ఆరుగురు డిప్యుటేషన్లపై ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. ఓ అటెండర్, ఓ ఫార్మసీ పోస్టు ఖాళీగా ఉంది. రోజుకు సుమారు 250 మంది ఓపీకి వస్తున్నారు. వర్షం వస్తే ఉరుస్తోంది.. పైకప్పు పెచ్చులూడుతోంది. గోడలు బీటలువారి ఉన్నాయి. పెద్ద ప్రమాదం జరగక ముందే అధికార యంత్రాంగం సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించేదెప్పుడు?

రెవెన్యూ సదస్సుల్లో రైతుల ఆవేదన



పాపసముద్రంలో సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

గుడిపాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు సరే.. సమస్యలు పరిష్కరించేదెప్పుడు? అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గుడిపాల మండలంలోని పాపసముద్రంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో ఒకరి భూమిని మరొకరికి ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. దీనిపై గతంలో జరిగిన గ్రామసభల్లో అర్జీలు ఇచ్చినా పరిష్కారం కాలేదు. ప్రస్తుతం రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు స్వీకరిస్తున్నారని.. వీటిని ఎప్పుడు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చి సదస్సు ముగించారు. ఈ సదస్సులో వీఆర్వోలు రాధిక, గోపికృష్ణ, టీడీపీ నాయకులు శేఖర్, ఐజక్, గణేష్, గజేంద్ర పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: డీకే మర్రిపల్లె జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ లోకనాథం పిళ్లై, డీటీ రవీంద్రబాబు, సర్వేయర్ సురేష్‌బాబు, నాయకులు రాజేంద్రన్, లోకేష్ పాల్గొన్నారు.

విజయపురంలో వచ్చిన అర్జీలు 601

విజయపురం: మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 601 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్‌లైన్ 23, ఆర్‌వోఆర్ 541, అసైన్‌మెంటు 21, 22ఏ 6, ఆక్రమణ 2, భూ రక్షణ 2, రీసర్వే 5, దారి సమస్యపై ఓ అర్జీ ఉన్నాయని పేర్కొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఐరాల విద్యార్థి



రోహిత్‌తో ఉపాధ్యాయులు

ఐరాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రోహిత్ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కోమల శుక్రవారం తెలిపారు. ఈనెలలో ఉత్తరాఖండ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు వెళ్లనున్నట్లు చెప్పారు. విద్యార్థిని, ఫెన్సింగ్ కోచ్ రాఘవకార్తిక్, పీడీ దేవాను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

ఎరువుల వాడకంపై అవగాహన సదస్సు

నగరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎరువుల వాడకంపై రైతులకు ఇఫ్కో జిల్లా మేనేజరు మణిచంద్రకుమార్ అవగాహన సదస్సు నిర్వహించారు. నగరి ప్రాథమిక సహకార కేంద్రంలో ఇఫ్కో ఎరువుల విక్రయదారుల సమావేశంలో ప్రసంగించారు. ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు సొసైటీలు, డీలర్ల వద్ద రసీదులు పొందాలని సూచించారు. ఇఫ్కో టోకియా గ్రామీణ వ్యక్తిగత ప్రమాద బీమా పథకం ద్వారా ప్రమాదంలో మరణించిన వారికి రూ2లక్షల బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. సంఘ సీఈవో తులసిపిళ్లై, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు విద్యుత్ గంట వితరణ



తవణంపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు 30వేల విలువైన ఆటోమేటిక్ విద్యుత్ గంటను వితరణగా ఇచ్చారు. 1991 సంవత్సరం పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడంలో భాగంగా గంటతోపాటు బీరువా, కుర్చీలను హెచ్ఎం దేవరాజులురెడ్డికి శుక్రవారం అందజేశారు. పూర్వ విద్యార్థులు లీలామనోహర్, చంద్ర మోహన్, అనంతకుమార్, తులసి, ప్రభ, శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

గంగాధరనెల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికార సంస్థ, జిల్లా సమైఖ్య సమన్వయంతో ముక్కళత్తూరుకు చెందిన రైతు మూర్తి మామిడితోపులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఎన్ఎఫ్, ఎస్‌డీపీ హేమావతి, అధికారులు ప్రతాప్, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్ బాబు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం



స్టాలిన్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న చెన్నకేశవులు తదితరులు

చిత్తూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలం వ.ఉ.త్త.క.ూ.రు.కు చెందిన టీడీపీ కార్యకర్త స్టాలిన్ అనారోగ్య కారణంతో శుక్రవారం మృతి చెందాడు. మట్టి ఖర్చుల కోసం ఆ కుటుంబానికి చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆయన తండ్రి చెన్నకేశవులు నాయుడు వచ్చి స్టాలిన్ కుటుంబీకులకు అందజేశారు. టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో జీన్ హెల్త్ కనెక్ట్ మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను అపోలో వైస్ చాన్సలర్ వినోద్ భట్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ. జన్యు పరీక్షల అవసరాన్ని ఈ ఎగ్జిబిషన్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఎగ్జామినేషన్ కంట్రోలర్ పోతురాజు, రిజిస్ట్రార్ సేతురామన్, ప్రొఫెసర్లు భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

రెండు కార్ల ఢీ: నలుగురికి స్వల్ప గాయాలు



క్షతగాత్రులు

గుడిపాల, జనవరి3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలో శుక్రవారం మధ్యాహ్నం రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. చిత్తూరు నుంచి వేలూరు వైపుగా వెళ్తున్న కారును 190 రామాపురం సీఎంసీ సమీపంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా మరో కారు ఢీకొంది. దీంతో తమిళనాడుకు చెందిన నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు సావిత్రిబాయి పూలే ఆదర్శం

వెదురుకుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్త్రీ విద్య సాధికారత కోసం జీవితాన్ని త్యాగం చేసిన సావిత్రిబాయి పూలే నేటి మహిళలకు ఆదర్శనీయమని కార్వేటినగరం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో సావిత్రిబాయి జయంతి సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. మహిళా టీచర్లను సత్కరించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు, టీచర్లు పాల్గొన్నారు.

● వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద, టీచర్లు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: నగరంలోని ఎంఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఉన్న బీసీ సంక్షేమ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం, వివిధ సంఘాల నేతలు ప్రసన్నకుమార్, హరిబాబు, శివకుమార్, వెంకటేశ్, శంకర్, మునిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు సెంట్రల్: నగరంలోని ఎస్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మనోహర్, మహిళా సాధికారిత విభాగం కోఆర్డినేటర్ ఉషారాణి ప్రసంగించారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, యూటీఎఫ్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద, ఓబీసీ మోర్చా, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక కేజీబీవీ పాఠశాలలో బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

గుడిపాల: నరహరిపేట జడ్పీహైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళా టీచర్లను సన్మానించారు. హెచ్ఎం ఖాతుంబీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ టీచర్‌గా లక్ష్మీదేవి



అవార్డును అందుకుంటున్న లక్ష్మీదేవి

మరకాలకుప్పం పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న లక్ష్మీదేవికి శుక్రవారం తిరుపతిలో సావిత్రీబాయి పూలే అవార్డును అందజేశారు. ఎస్వీయూ సెనెట్ హాల్‌లో నిర్వహించిన సభలో ఉత్తమ టీచర్‌గా ఎంపిక కావడంతో సన్మానించారు. ఈమెకు ఎంఈవోలు హసన్ బాషా, గణపతి అభినందనలు తెలిపారు.

మహిళల అభ్యున్నతికి మార్గదర్శి: ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరు సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి మార్గదర్శి సావిత్రిబాయి పూలే అని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం సావిత్రిబాయి జయంతి సందర్భంగా ఆమెకు నివాళి అర్పించారు. మహిళల విద్యకు ఆద్యురాలిగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. సావిత్రి బాయి ఆశయాలకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల సామాజిక, రాజకీయ అభ్యున్నతికోసం సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని వివరించారు.

సంక్షిప్తంగా..

క్యాలెండరు ఆవిష్కరణ

వెదురుకుప్పం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండల విద్యావనరుల కేంద్రం వద్ద శుక్రవారం యూటీఎఫ్ క్యాలెండరు, డైరీలను ఎంఈవో దామోదరం ఆవిష్కరించారు. నాయకులు దేశయ్య, గురునాథం, శ్రీనివాసులు, జయచంద్రారెడ్డి, యుగంధర్, రామచంద్రారెడ్డి, మురగయ్య, బాలసుబ్రహ్మణ్యం, భారతి, అక్బర్‌బాషా పాల్గొన్నారు.

● కార్వేటినగరంలో ఏపీటీఎఫ్ క్యాలెండరును ఎంఈవోలు విజయకుమార్, డీపీ మనోజ్‌కుమార్ ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కిరణ్, మండల అధ్యక్షుడు బాబు, ప్రధాన కార్యదర్శి కదిరివేలు, గౌరవ అధ్యక్షుడు ఆనందయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల వితరణ

నింద్ర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివ్యాంగులకు అగరంలో శుక్రవారం దుప్పట్లు వితరణ చేశారు. అమరావతి వికలాంగుల సేవా సమితి మండల అధ్యక్షుడు జయరాం నాయుడు ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన బాలాజీ నాయుడి సహకారంతో 34 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు.

ఆశాలకు ఇచ్చిన హామీ అమలు చేయాలి: ఏఐటీయూసీ

నగరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఆశా కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం జరిగిన సమావేశంలో చందామనైతే కలిసి ప్రసంగించారు. రాజేశ్వరి, ఇంద్ర, పుష్ప, రేణుక, సుబ్బలక్ష్మి, జయప్రద పాల్గొన్నారు.

ఎల్టీఏ క్యాలెండర్ ఆవిష్కరణ

చిత్తూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ (ఎల్టీఏ) నూతన క్యాలెండర్‌ను డాక్టర్ సుధారాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ అనిల్ కలిసి ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసప్రసాద్‌రెడ్డి, కోశాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి,సభ్యులుపాల్గొన్నారు.

సీఎంను కలిసిన రాజేష్



నింద్ర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును నింద్ర మండలం ఓరూరుపేటకు చెందిన దివంగత నాయకుడు గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ తనయుడు రాజేష్ మర్యాదపూర్వకంగా శుక్రవారం అమరావతిలో కలిశారు. రమేష్ చంద్ర ప్రసాద్ మరణానంతరం ముఖ్యమంత్రిని తొలిసారిగా కలవగా, తమ బాగోగులు అడిగి తెలుసుకున్నారని రాజేష్ వివరించారు. తన తండ్రిలాగే ప్రజలకు సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలని చంద్రబాబు సూచించారన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

తవణంపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక ఓ వ్యక్తి బావిలోపడి మృతి చెందినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ గజేంద్ర తెలిపారు. చిత్తూరు గిరింపేట సిద్దార్థ నగర్ కాలనీకి చెందిన శంకర్‌నారాయణ (54)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. గతనెల 22వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తండ్రి కనపడలేదని ఆయన కుమారుడు జగదీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తవణంపల్లె మండలంలోని కారకాంపల్లెకు చెందిన జయరాంనాయుడు వ్యవసాయ బావిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికెళ్లి పరిశీలించగా, శంకర్‌నారాయణగా గుర్తించి జగదీష్‌కు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చిత్తూరుకు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.